అప్పుల కుప్పగా భారత్

సెప్టెంబర్ త్రైమాసికానికి 205 లక్షల కోట్లకు చేరిక

ముంబై: దేశం అప్పుల కుప్పగా మారుతోంది. భారత్‌పై అప్పు భారం ఏటికేడు పెరుగుతూ వస్తున్నది. ఈ ఏడాది సెప్టెంబర్ త్రైమాసికానికి భారత్ నెత్తిపై రూ.205 లక్షల కోట్ల రుణ భారం నమోదైంది. దేశం మొత్తం రుణాలు లేదా మార్కెట్‌లో ట్రేడవుతున్న మొత్తం బాకీలు 2.47 ట్రిలియన్ యూఎస్ డాలర్లు (రూ.205 లక్షల కోట్లు)కు పెరిగాయని ఒక నివేదిక తెలిపింది. సెప్టెంబర్ త్రైమాసికంలో దేశం అప్పులు 1.34 ట్రిలియన్ డాలర్లు (రూ.161.1 లక్షల కోట్లు)గా నమోదైనట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించిన డాటాను ఉటంకిస్తూ ఇండియన్ బాండ్స్.కామ్ సహ వ్యవస్థాపకుడు విశాల్ గోయెంకా వివరించారు. రూ.161.1 లక్షల కోట్ల రుణం వద్ద మొత్తం రుణంలో కేంద్ర ప్రభుత్వ అప్పు వాటా అత్యధికంగా 46.04 శాతం నమోదైంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వాల వాటా 24.4 శాతం అనగా 604 బిలియన్ యూఎస్ డాలర్లు (రూ.50.18 లక్షల కోట్లు), ట్రెజరీ బిల్లుల వాటా 4.51 శాతం(111 బిలియన్ యూఎస్ డాలర్లు అంటే రూ.50.18 లక్షల కోట్లు), కార్పొరేట్ బాండ్ల వాటా 21.52 శాతం ఉన్నాయి.

మార్చి నుంచి జీపీఎస్ ఆధారిత టోల్!

న్యూఢిల్లీ: త్వరలోనే హైవేలపై ఉన్న టోల్ ప్లాజాలు కనుమరుగు కానున్నాయి. వాటి స్థానంలో టోల్ టాక్స్ వసూలుకు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. టోల్‌ప్లాజాల స్థానంలో నూతన సాంకేతికతను ప్రవేశపెట్టి దేశ వ్యాప్తంగా జీపీఎస్ ఆధారిత టోల్ వసూలు చేపడతామని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం వెల్లడించారు. ఈ విధానం వల్ల ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడమే కాక, తాము ప్రయాణించాల్సిన దూరానికి కచ్చితమైన చార్జినే చెల్లిస్తారని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి కల్లా కొత్త టోల్ వసూలు విధానాన్ని ప్రారంభిస్తామన్నారు. వాహనాలు టోల్ చెల్లింపు కోసం ఆగక్కర్లేదని... ఆటోమేటిక్‌గా నెంబర్ ప్లేట్లను గుర్తించే కెమెరా వ్యవస్థ పనిచేస్తుందని, ఇది పైలట్ ప్రాజెక్టుగా పరిశీలనలో ఉందని మంత్రి చెప్పారు.

చట్టానికి కట్టుబడి పనిచేస్తాం

పన్నూ హత్య కుట్రపై ప్రధాని

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్రలో భారత్ ప్రమేయంపై అమెరికా చేస్తున్న ఆరోపణలపై తొలిసారిగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. తాము చట్టానికి కట్టుబడే పనిచేస్తామని, దీనిపై ఎవరి దగ్గరన్నా సమాచారం ఉంటే దానిని అందిస్తే తప్పక పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు. బ్రిటన్‌కు చెందిన ఫైనాన్షియల్ టైమ్స్ డైలీతో మోదీ మాట్లాడారు. అమెరికాలో ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూను హత్య చేయడానికి భారత ప్రభుత్వ ఉద్యోగి నిఖిల్ గుప్తా విఫల కుట్ర చేశాడని యూఎస్ ఫెడరల్ ప్రాసిక్యూటర్స్ చేస్తున్న ఆరోపణలపై భారత్ ఒక విచారణ కమిటీని నియమించిందన్నారు.

సీబీఐకి 10 రాష్ట్రాలు 'సమ్మతి' ఉపసంహరణ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాలు సీబీఐకి 'జనరల్ కన్సెంట్(సాధారణ సమ్మతి)'ని ఉపసంహరించుకున్నాయని కేంద్రం వెల్లడించింది. ఈ రాష్ట్రాల జాబితాలో తమిళనాడు, తెలంగాణ, పంజాబ్, జార్ఖండ్, కేరళ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, మేఘాలయా ఉన్నాయని బుధవారం లోక్‌సభలో కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ రాతపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీలను వేగవంతంగా, మిషన్ మోడ్‌లో భర్తీ చేస్తున్నామని కేంద్రం ప్రకటించింది. ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నది.

లాలూ, తేజస్వీలకు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ : 'ల్యాండ్ ఫర్ జాబ్స్' మనీ ల్యాండరింగ్ కేసులో బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీయాదవ్, ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్‌యాదవ్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది. డిసెంబరు 22న, 27న తమ ఢిల్లీ కార్యాలయానికి రావాలని కోరింది. లాలుకు ఈడీ సమన్లు ఇవ్వడం ఇదే తొలిసారి. ఈ కేసులో కీలక నిందితుడైన అమిత్ కత్యాల్‌ను ఈడీ ప్రశ్నించిన తర్వాతే ఈ సమన్లు ఇవ్వడం గమనార్హం.

దేశంలో మళ్లీ కరోనా కేసులు వెలుగుచూస్తుండటంతో బుధవారం బెంగళూరులో మాస్క్‌లు ధరించిన యువతులు

కరోనా డేంజర్ బెల్స్!

దేశంలో ఒక్క రోజే 614 కేసులు.. ముగ్గురి మృతి

జేఎన్.1 రకం 21 కేసులు నమోదు

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: కరోనా మళ్లీ డేంజర్ బెల్స్ మోగిస్తున్నది. గత 24 గంటల్లో దేశంలో రికార్డు స్థాయిలో 614 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది మే 21 తర్వాత ఇంత అధిక స్థాయిలో కరోనా కేసులు నమోదు కావడం ఇదే ప్రథమం. దీంతో దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 2,311కు చేరినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ బుధవారం పేర్కొంది. కొవిడ్-19 ఉప రకం జేఎన్.1కు సంబంధించి మూడు రాష్ట్రాల్లో 21 కేసులు నమోదయ్యాయి. గోవాలో 19, మహారాష్ట్ర, కేరళలో ఒక్కొక్క కేసు నమోదయ్యాయి. ఈ ఉప వేరియంట్ వ్యాప్తికి గల కారణాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. గత 24 గంటల వ్యవధిలో కరోనా కారణంగా కేరళలో మూడు మరణాలు నమోదయ్యాయి.

అప్రమత్తంగా ఉండండి.. ఆందోళన వద్దు

దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్న క్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయ ఆధ్వర్యంలో బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కరోనా పూర్తిగా నాశనం కాలేదని, ఇటీవల కాలంలో కొత్త వేరియంట్ వెలుగుచూస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా కేరళ, మహారాష్ట్ర, జార్ఖండ్, కర్ణాటక రాష్ట్రాల్లో పాజిటివిటీ రేటు పెరిగిందని చెప్పారు. కరోనా వ్యాధి సన్నద్ధత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు తదితర అంశాలను ఆయన వివిధ రాష్ట్రాలతో చర్చించారు. కేసుల పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేకపోయినా అప్రమత్తత అవసరమని ఆయన అన్నారు. కేసులపై నిఘా పెంచాలని, అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులను తగిన స్థాయిలో నిల్వ ఉంచాలని, ఆక్సిజన్, కాన్సంట్రేటర్లు, వెంటిలేటర్లు, వ్యాక్సిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని ఆయన రాష్ట్రాలు, యూటీలకు సూచించారు. పీఎస్ఏ ప్లాంట్లు, వెంటిలేటర్ల పనితీరును పరిశీలించేందుకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ప్రతి మూడు నెలలకోసారి ఆసుపత్రులలో సన్నద్ధతపై మాక్‌డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. అలాగే టెస్టుల సంఖ్యను పెంచాలని, తాజా కేసులు, టెస్టులు, పాజిటివిటీకి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు కేంద్రంతో పంచుకోవాలని మంత్రి మాండవీయ కోరారు.

న్యాయమే లక్ష్యం

- మానవ కేంద్రీకృత విధానంతో న్యాయ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తాం
- నేర న్యాయ బిల్లులపై హోంమంత్రి అమిత్ షా
- మూడు కొత్త బిల్లులకు లోక్‌సభ ఆమోదం
- పాత చట్టాలు వలస కాలం నాటివని షా విమర్శ
- జరిమానాలే తప్ప న్యాయం ఉండదని వ్యాఖ్య

బుధవారం లోక్‌సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: బ్రిటీష్ కాలం నుంచి అమల్లో ఉన్న ఐపీసీ-1860, సీఆర్‌పీసీ-1898, ఎవిడెన్స్ యాక్ట్-1872 చట్టాల స్థానంలో కొత్త చట్టాలను తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మూడు కొత్త నేర న్యాయ బిల్లులకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. భారతీయ న్యాయ(రెండో) సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష(రెండో) సంహిత, భారతీయ సాక్ష్య(రెండో) బిల్లులను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభలో ప్రవేశపెట్టగా స్వల్ప కాలిక చర్చ అనంతరం మూజువాణి ఓటుతో బిల్లులను కేంద్ర సర్కార్ ఆమోదింపజేసుకొన్నది. లోక్‌సభలో విపక్షాలకు చెందిన 90 మందికి పైగా ఎంపీలను సస్పెండ్ చేసిన క్రమంలో ఈ బిల్లులను మోదీ సర్కార్ ఆమోదింపజేసుకోవడం గమనార్హం. కాగా, గతంలో తీసుకొచ్చిన మూడు బిల్లులపై పలు అభ్యంతరాలు వ్యక్తం అయిన నేపథ్యంలో ఇటీవల వాటిని వెనక్కు తీసుకొన్న కేంద్రం.. వెంటనే కొత్త ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

న్యాయ వ్యవస్థలో సమూల మార్పులు

కొత్త బిల్లులు జరిమానాలు విధించే బదులు న్యాయం అందించడంపై దృష్టి పెడతాయని అమిత్‌షా పేర్కొన్నారు. వలస కాలం నాటి చట్టాల స్థానంలో తీసుకొచ్చిన ఈ బిల్లులు మానవ కేంద్రీకృత విధానంతో నేర న్యాయ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తాయన్నారు. వాటిల్లో శిక్షించాలనే ఉద్దేశం ఉండేతప్ప న్యాయం చేయాలనే అంశం లేదని పేర్కొన్నారు. కొత్త ప్రతిపాదిత బిల్లుల్లో ఉగ్రవాదానికి స్పష్టమైన నిర్వచనం ఉన్నదని, దేశద్రోహాన్ని నేరంగా తొలగించి, 'రాజ్యానికి వ్యతిరేకంగా నేరాలు' అనే కొత్త సెక్షన్‌ను ప్రవేశపెట్టామని తెలిపారు.

మూక దాడులకు మరణ శిక్ష

బిల్లుల్లోని కీలక అంశాలను అమిత్‌షా ఈ సందర్భంగా స్వల్పంగా వివరించారు. మూక దాడులకు కొత్త బిల్లులు మరణ శిక్ష విధిస్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో ఈ విధమైన శిక్షను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. 'ఒకరి మెదడు భారతీయులదైతే వారికి చట్టాలు అర్థం అవుతాయి. అదే ఇటాలియన్‌ది అయితే అర్థం కావు.. 'అని ప్రతిపక్ష కాంగ్రెస్‌ను ఉద్దేశించి అమిత్‌షా వ్యాఖ్యానించారు. ఎవరైనా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తే, అతన్ని శిక్షించాల్సిన అవసరం లేదని, అది అతని భావ ప్రకటనా స్వేచ్ఛ అని అన్నారు. దేశానికి వ్యతిరేకంగా ఎవరైనా చర్యలకు పాల్పడితే, అటువంటి వారిని సహించేది లేదని, కఠిన శిక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

టెలికాం బిల్లుకు లోక్‌సభ ఆమోదం

టెలీ కమ్యూనికేషన్స్ బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. టెలిగ్రాఫ్ చట్టం-1985, ఇండియన్ వైర్‌లెస్ టెలిగ్రాఫీ చట్టం-1933లను రద్దు చేస్తూ తీసుకొచ్చిన ఈ కొత్త బిల్లు ప్రధానంగా వినియోగదారుల రక్షణకు ఉద్దేశించినదని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇక నుంచి సిమ్ కార్డుల జారీలో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని, ఉల్లంఘనులకు మూడేండ్ల వరకు శిక్ష, జరిమానా పడుతుందని చెప్పారు.

మరో ఇద్దరు ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్

143కి చేరిన సంఖ్య

భద్రతా ఉల్లంఘన ఘటనపై పార్లమెంట్‌లో విపక్ష పార్టీల ఎంపీల ఆందోళన కొనసాగింది. విపక్ష ఎంపీల సస్పెన్షన్ల పర్వం కూడా కొనసాగింది. మరో ఇద్దరు ఎంపీలపై బుధవారం సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో ఉభయ సభల్లో సస్పెన్షకు గురైన ఎంపీల సంఖ్య 143కు చేరింది. తాజాగా సభలో ప్లకార్డులు ప్రదర్శించారని పేర్కొంటూ కేరళ కాంగ్రెస్(మణి) థామస్, సీపీఎం ఎంపీ ఏఎం ఆరిఫ్ ఖాన్‌ల సస్పెన్షన్‌పై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తీర్మానం పెట్టారు. భద్రత ఉల్లంఘన ఘటనపై హోంమంత్రి సమాధానం చెప్పాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు రాజ్యసభ కూడా వాయిదాల పర్వంలో నడిచింది.

రాజ్యసభ చైర్మన్ ధన్‌కర్.. విలేకరులతో మాట్లాడుతున్న టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ

హుందాగా ఉందాం

- టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ 'మిమిక్రీ' ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచన
- ఎంపీల సస్పెన్షన్‌పై దృష్టి మరల్చడానికేనన్న విపక్షాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మిమిక్రీ చేసిన విధానం బాధాకరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. 'ఎంపీలు తమ గొంతును స్వేచ్ఛగా వినిపించాలి. ఇది హుందాగా, పార్లమెంట్ నిబంధనలకు లోబడి ఉండాలి' అని తెలిపారు. విపక్ష ఎంపీల సస్పెన్షన్లను నిరసిస్తూ మంగళవారం ఎంపీలు పార్లమెంట్ మెట్లపై ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంపీ కళ్యాణ్ బెనర్జీ రాజ్యసభ చైర్మన్ ధన్‌కర్‌ను ఉద్దేశించి మిమిక్రీ చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. కాగా, తన చివరి శ్వాస వరకు పార్లమెంట్ గొప్పతనాన్ని కాపాడటానికి కృషి చేస్తానని ధన్‌కర్ వెల్లడించారు. ధన్‌కర్‌కు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సంఘీభావం తెలిపారు.

మోదీ వ్యాఖ్యల మాటేంటి?

ప్రతిపక్ష ఎంపీల తీరు బాధాకరమని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ స్పందిస్తూ 'సస్పెన్షన్ల నుంచి దృష్టి మరల్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది' అని పేర్కొన్నారు. గతంలో ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీని ఉద్దేశించి ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యల వీడియోను ఆయన పోస్టు చేశారు. ఓ సందర్భంలో మోదీ మాట్లాడుతూ అన్సారీ గుర్తింపును ఒక మతానికి పరిమితం చేశారని, మత గుర్తింపు కారణంగానే ఆయన రాజకీయంగా ఎదిగినట్టు వ్యాఖ్యానించారని ఆరోపించారు. తమ పార్టీ ఎంపీ చర్యపై బెంగాల్ సీఎం మమత మాట్లాడుతూ 'ఇది ఆందోళనలో భాగంగా జరిగే సాధారణ చర్యే' అని అన్నారు. ఎంపీ కళ్యాణ్ బెనర్జీ స్పందిస్తూ ఎవరినీ అవమానపర్చాలనే ఉద్దేశం తనకు లేదన్నారు. ఎంపీ కళ్యాణ్ బెనర్జీపై కేసు నమోదు చేయాలంటూ న్యాయవాది అభిషేక్ గౌతమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎంపీల సస్పెన్షన్‌పై స్పందించరెందుకు?

143 మంది ప్రతిపక్ష ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేస్తే ఎవరూ స్పందించరు గానీ.. మిమిక్రీ ఘటనపై విపరీతంగా స్పందిస్తున్నారని మీడియాను ఉద్దేశించి రాహుల్ అన్నారు.

ఏజెంట్ల మోసం.. విద్యార్థులకు శాపం

అమెరికా, కెనడాల్లో 28 మంది భారత విద్యార్థుల బహిష్కరణ

దౌత్య మార్గంలో సమస్య పరిష్కారానికి కృషి: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: ఉన్నత చదువుల కోసం అమెరికా, కెనడాల్లో అడుగుపెడుతున్న వేలాది మంది భారతీయ విద్యార్థులు అక్కడ ఊహించని పరిస్థితుల్లో చిక్కుకుపోతున్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ నకిలీ ఏజెంట్లు చేస్తున్న మోసాలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బలవుతున్నారు. నకిలీ అడ్మిషన్ లెటర్స్‌తో తమ దేశానికి వచ్చారని వందలాది మంది భారతీయ విద్యార్థులపై అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో 28 మంది భారతీయ విద్యార్థులపై అమెరికా బహిష్కరణ వేటు వేసింది. ఈ సమస్య అమెరికాకే గాక, కెనడాలోనూ మొదలైంది. వందలాది మంది విద్యార్థులపై బహిష్కరణ వేటు వేసేందుకు కెనడా అధికారులు రంగం సిద్ధం చేశారు. అయితే, దీనిపై భారత విదేశాంగ అధికారులు స్పందిస్తూ..ఏజెంట్లు చేసిన మోసాలకు విద్యార్థులను బలి చేయవద్దని అమెరికా, కెనడా ప్రభుత్వాలను కోరుతున్నది. ఈ అంశంపై కేంద్ర సహాయ మంత్రి వి మురళీధరన్ లోక్‌సభలో మాట్లాడుతూ, 'ఈ సమస్యకు ముఖ్య కారణం నకిలీ ఏజెంట్లని మేం గుర్తించాం. కేంద్రం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఆయా కేసులతో సంబంధమున్న నకిలీ ఏజెంట్లను, సంస్థలను గుర్తించే పని చేపట్టాం. బహిష్కరణ వేటు పడ్డ కొంతమంది విద్యార్థులు అక్కడి న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఈ సమస్యను కెనడాతో దౌత్య మార్గంలో పరిష్కరించే ప్రయత్నం భారత్ చేస్తున్నది' అని చెప్పారు. 'చెల్లుబాటు అయ్యే స్టూడెంట్ వీసాలను కలిగిఉన్న వారి విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని అమెరికాను కోరాం. అక్కడి అధికార యంత్రాంగంతో నిరంతరం టచ్‌లో ఉన్నాం' అని అన్నారు.

దండకారణ్యంలో భీకర పోరు

ఆరుగురు మావోయిస్టుల మృతి

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 20 : కొన్ని రోజులుగా ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య భీకర పోరు కొనసాగుతున్నది. బుధవారం జవాన్లకు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు తెలిసింది. సుక్మా జిల్లా చింతల్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారం- కొత్తపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు క్యాంపు నిర్వహించారనే విశ్వసనీయ సమాచారం మేరకు భద్రతా బలగాలు సెర్చింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం నాగారం-కొత్తపల్లి అడవుల్లో మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు ప్రారంభించారు. ఇరువర్గాల మధ్య సుమారు గంటన్నరపాటు భీకర యుద్ధం జరిగింది. ఈ ఘటనలో సుమారు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు పోలీస్ అధికారులు తెలిపారు. ఘటనా స్థలంలో మావోయిస్టుల క్యాంపుని ధ్వంసం చేసి, భారీగా పేలుడు పదార్థాలు, ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనపరుచుకున్నట్టు సమాచారం.

కాంగ్రెస్‌కు క్రౌడ్ ఫండింగ్ ఎందుకు?

800 కోట్ల ఆస్తులున్నా విరాళాల సేకరణ

ఆ పార్టీలో నిధుల కొరత నిజమేనా అని సాగుతున్న చర్చ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): దేశాన్ని 50 ఏండ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ ఇప్పుడు దేశ ప్రజలను చందాలు అడుగుతున్నది. కాంగ్రెస్‌ను ఆర్థికంగా పరిపుష్టం చేయాలని క్రౌడ్ ఫండింగ్ చేపట్టినట్టు ఆ పార్టీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ ప్రకటించారు. కానీ దీని అసలు ఉద్దేశం అదేనా, 138 ఏండ్ల చరిత్ర కలిగిన ఆ పార్టీకి నిధుల కొరత నిజమేనా అన్న చర్చ జరుగుతోంది. రూ.800 కోట్ల ఆస్తులతో దేశంలో రెండో ధనిక పార్టీ అయిన కాంగ్రెస్ ఇటీవల తమ ఆదాయం 29 శాతం తగ్గిపోయిందని చెప్తున్నది.

బ్లాక్ మనీని వైట్ చేసేందుకా?!

కాంగ్రెస్ తాజాగా చందాలడగడానికి గల కారణాలను రాజకీయ పరిశీలకులు మూడు రకాలుగా విశ్లేషిస్తున్నారు. అందులో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోవటానికి నిధుల సమీకరించడమని చెబుతూనే, బడా బాబుల బ్లాక్ మనీని వైట్ చేయడానికి కూడా ఈ ఎత్తు వేశారని కొందరు విశ్లేషిస్తున్నారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల ద్వారా నిధులు రాకుండా బడా కంపెనీలను నియంత్రిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పెద్దలకు చెక్ పెట్టటానికి ఈ ఎత్తు వేశారని కొందరు విశ్లేషకులు అంటున్నారు.

సానుభూతి పొందడానికే!

కాంగ్రెస్ బీద పార్టీ అని, ఎన్నికల ఖర్చుల కోసం డబ్బులు లేవని సామాన్యుల సానుభూతి పొందేందుకు ఇంటింటా చందాల పేరిట దగ్గరవ్వాలన్నది కాంగ్రెస్ పార్టీ వ్యూహమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దేశంలో అత్యధిక కాలం తాము అధికారంలో ఉన్నా, బీజేపీ దగ్గర ఉన్నంత డబ్బు తమ దగ్గర లేదని ప్రజలకు వివరించాలన్నది మరో వ్యూహమట. బీజేపీ వద్ద ఇప్పుడు 6 వేల కోట్లకు పైగా ధనం ఉందని, అదంతా బడా బాబుల దగ్గర వసూలు చేసిందేనని ప్రజలకు చెప్పి సానుభూతి పొందేందుకు కాంగ్రెస్ పెద్ద ఎత్తుగడ వేసిందని కొందరు విశ్లేషిస్తున్నారు.

పతంజలి శాస్త్రికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: ప్రముఖ తెలుగు రచయిత తల్లవజ్జల పతంజలి శాస్త్రికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. 2023 ఏడాదికి సంబంధించి 24 భాషల సాహితీకారులను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలకు ఎంపిక చేశామని అకాడమీ కార్యదర్శి శ్రీనివాస రావు బుధవారం ప్రకటించారు. తెలుగులో 'రామేశ్వరం కాకులు.. మరికొన్ని కథలు' రచనకు గాను తల్లవజ్జల పతంజలి శాస్త్రికి ఈ అవార్డు అందిస్తున్నట్టు తెలిపారు. 1945లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురంలో జన్మించిన పతంజలి ఒంగోలులో విద్యనభ్యసించారు. లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆయన పతంజలి శాస్త్రి కథలు, వడ్ల చిలుకలు లాంటి కథా సంపుటాలు వెలువరించారు.

ఇస్రోకు 'లీఫ్ ఎరిక్సన్ లూనార్' అవార్డు

న్యూఢిల్లీ: చంద్రయాన్-3 విజయంతో అంతరిక్ష రంగంలో ఘన కీర్తి సాధించిన ఇస్రోను ఐస్‌లాండ్ అవార్డు వరించింది. విజయవంతంగా చంద్రయాన్-3 మిషన్‌ను చేపట్టినందుకు గాను హుసావిక్ నగరంలోని ఎక్స్‌ప్లోరేషన్ మ్యూజియం 'లీఫ్ ఎరిక్సన్ లూనార్ ప్రైజ్-2023'ను ప్రకటించింది. చంద్రుడి దక్షిణ ధృవంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన మొదటి దేశంగా నిలిచిన భారత్‌ను ఈ అవార్డు వరించడం సంతోషకరమని ఐస్‌లాండ్‌లో భారత రాయబార కార్యాలయం పేర్కొన్నది. అవార్డును ఇస్రో తరపున రాయబారి బీ శ్యామ్ అందుకొన్నారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మెన్ ఎస్ సోమనాథ్ నిర్వాహకులకు ధన్యవాదాల సందేశం పంపారు. కొలంబస్ అన్వేష యాత్ర కంటే నాలుగు శతాబ్దాల ముందుగానే అమెరికా భూభాగంపై అడుగుపెట్టిన మొదటి యూరోపియన్‌గా భావిస్తున్న లీఫ్ ఎరిక్సన్ పేరు మీదుగా ఈ అవార్డును అందజేస్తున్నారు.

ప్రత్యక్ష అనుభూతితో దారి చూపిస్తుంది

న్యూఢిల్లీ : మనం వెళ్లాలనుకుంటున్న చిరునామాకు సంబంధించి వర్చువల్ రియాల్టీ అనుభూతితో దారి చూపే విధంగా గూగుల్ మ్యాప్స్‌లో సరికొత్త ఆప్షన్ త్వరలో రాబోతున్నది. రోడ్డుపై నడుస్తున్న ప్రత్యక్ష అనుభూతిని కలిగించే విధంగా భవనాలు, రోడ్డు మార్గాలు కనపడటం ఇందులో ప్రత్యేకత. భారత్‌లో 3 వేల నగరాల్లో 'అడ్రస్ డిస్క్రిప్టర్' సేవలు అందుబాటులోకి వస్తాయని గూగుల్ మ్యాప్స్ వైస్ ప్రెసిడెంట్ మిరాయం డానియెల్ ప్రకటించారు. 'గమ్యాన్ని చక్కగా అవగాహన చేసుకోవటంలో అడ్రస్ డిస్క్రిప్టర్ అద్భుతంగా పని చేస్తుంది' అని డానియెల్ వివరించారు. నావిగేషన్‌ను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఉంటుందన్నారు.

తగ్గిపోతున్న పరపరాగ సంపర్కం

న్యూఢిల్లీ, డిసెంబర్ 20 : పర్యావరణ మార్పులు కొన్ని లక్షల కీటక జాతులను అంతమొందిస్తున్నాయి. దీంతో మొక్కలు, పువ్వుల్లో పరపరాగ సంపర్కం తగ్గిందని, కీటకాల్ని పువ్వులు ఆకర్షించటం తగ్గినందు వల్లే ఈ పరిణామం ఏర్పడిందని 'న్యూ సైంటిస్ట్' జర్నల్ కథనం పేర్కొన్నది. దీని ప్రకారం, గత 150 ఏండ్లలో 2.5 లక్షల నుంచి 5 లక్షల వరకు కీటక జాతులు కనుమరుగయ్యాయి. కీటకాల జనాభాల్లో ఏటా 2 శాతం తగ్గుదల నమోదైందని నివేదిక తెలిపింది. పువ్వులు, మొక్కలు కీటకాల కోసం మకరందాల్ని తయారుచేస్తాయి. బదులుగా కీటకాలు మొక్కల మధ్య పుప్పొడిని రవాణా చేస్తాయి.

30న అయోధ్యకు మొదటి విమానం

న్యూఢిల్లీ: అయోధ్యలోని అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైన వెంటనే అక్కడికి తమ విమాన సర్వీసులను ప్రారంభిస్తామని 'ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్' ప్రకటించింది. తమ సంస్థ నుంచి ప్రారంభ విమానం ఢిల్లీ నుంచి అయోధ్యకు ఈ నెల 30న ప్రయాణిస్తుందని, ఈ మార్గంలో రోజువారీ సేవలు జనవరి 16 నుంచి మొదలవుతాయని బుధవారం వెల్లడించింది. అయోధ్యలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. అయోధ్య రామ మందిరంలో జనవరి 22న తలపెట్టిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం కన్నా ముందే విమానాశ్రయ ప్రారంభోత్సవం ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.



ట్రంప్‌నకు